అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 04 జనవరి 2023

క్షేత్ర స్థాయిలో పంట వివరాలు సేకరణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి , కొట్టాల్, జాన్కంపల్లి గ్రామాలలో మంగళవారం పంటల వివరాల నమోదు సర్వే నంబర్ వారిగా క్షేత్ర స్థాయిలో వెరిఫై చేసినట్టు మండల వ్యవసాయ అధికారి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా పియస్‌బి, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఏఈఓ రవి బ్రాహ్మణపల్లి గ్రామంలో, వ్యవసాయ విస్తీర్ణాధికారి సతీష్ కొట్టాల్, జాన్కంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించినట్టు తెలిపారు.



పంటలు పరిశీలిస్తున్న అధికారులు

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పిట్లం

పెద కుటుంబాలకు భరోసా కల్పించడానికి యూనియన్ బ్యాంక్ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ ముఖేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద కుటుంబాల వార్షిక ప్రీమియం రూపాయలు 20, 436 రూపాయలతో ప్రధానమంత్రి సురక్ష, జీవన్ జ్యోతి బీమా యోజన పథకల ద్వారా 2 , లక్షల రూపాయల ప్రమాదం బీమా అందనుందని, 18 నుండి 70 , 18 నుండి 50 సంవత్సరాల వయస్సు గల బ్యాంక్ ఖాతాదారులు అర్హులన్నారు. ఆసక్తిగల పేద కుటుంబాల ఖాతాదారులు బ్యాంకు సిబ్బందిని సంప్రదించి లబ్ధి పొందాలని ఆయన కోరారు.

సమిష్టి కృషితో 'కంటి వెలుగు'

- అందరి సహకారంతో విజయవంతం చేస్తాం
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యారోగ్యశాఖా మంత్రి దిశా నిర్దేశం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్నిసమిష్టి కృషితో విజయవంతం చేస్తామని రాష్ట్ర రోడ్లు - భవనాలు, గృహ నిర్మాణ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తో కలిసి రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీష్ రావు మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, జెడ్పి చైర్మన్లు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ చైర్ పర్సన్లు, అదనపు కలెక్టర్లు, డీ ఎం హెచ్ ఓ లు, ఇతర శాఖల అధికారులతో కంటి వెలుగు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి మంత్రి ప్రశాంత్ రెడ్డి ఈ వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా దృక్పథంతో కూడిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో నూటికి నూరు శాతం విజయవంతం చేసేందుకు అంకిత భావంతో కృషి చేస్తామని, ప్రజా ప్రతినిధులు, అధికారులందరిని భాగస్వాములు చేస్తామని అన్నారు. మొదటి విడతలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా గిన్నీస్ రికార్డులో నమోదయ్యే తరహాలో ప్రపంచంలోనే మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో కోటీ 54 లక్షల మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 50 లక్షల మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడం అరుదైన చరిత్ర సృష్టించిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఈ నెల 18 నుండి మలివిడతగా ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకుని, తదనుగుణంగా ముందుకెళ్తామని అన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి వేముల

మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ, కంటి వెలుగు విజయవంతానికి ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యమని సూచించారు. గ్రామ పంచాయతీలు, హాబిటేషన్ల వారీగా కంటి వెలుగు శిబిరాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని అన్నారు. ఇదివరకు నాలుగు సంవత్సరాల క్రితం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎనిమిది నెలల పాటు కొనసాగించడం జరిగిందని, ఈసారి వంద పని దినాలలోనే పూర్తి చేసేలా ప్రణాళికను రూపొందించుకున్నామని, ఎక్కడ కూడా అర్థాంతరంగా శిబిరాల నిర్వహణ ఆగిపోకుండా అదనపు బృందా లను అందు బాటులో ఉంచాలని అన్నారు.

ఈ సందర్భంగా వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ అందరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. శిబిరాల నిర్వహణకు అవసరమైన సామాగ్రితో పాటు రీడింగ్ అద్దాలను ముందుగానే జిల్లాలకు పంపిస్తున్నామని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ, అవసరమైన నిధులను కూడా సమకూరుస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని శిబిరాల విజయవంతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి సూచించారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణ కోసం నియమించిన బృందాలు వారికి కేటాయించిన క్షేత్రాల్లో స్థానికంగా బస చేసేలా జిల్లా యంత్రాంగాలు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం 10 . 00 గంటల నుండి సాయంత్రం 4 . 00 గంటల వరకు ఈ శిబిరాలు కొనసాగుతాయని, నిర్ణీత సమయానికి ముందే ఎనిమిది మంది సభ్యులతో కూడిన బృందాలు తమకు కేటాయించిన శిబిరం వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. శిబిరాలు సజావుగా సాగుతున్నాయా లేదా అన్నది పరిశీలించేందుకు వీలుగా రాష్ట్ర స్థాయిలో పది క్వాలిటీ కంట్రోల్ బృందాలను, జిల్లా స్థాయిలో ఒకటి చొప్పున బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ బృందాలు ఆకస్మికంగా పర్యటిస్తూ శిబిరాల నిర్వహణ తీరును పరిశీలిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16533 శిబిరాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామని, వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 12768 శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లో 3788 శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి శిబిరం వద్ద షామియానాలు, టేబుళ్లు, కుర్చీలు వంటి మౌలిక సదుపాయాలతో పాటు తాగునీరు, విద్యుత్, శానిటేషన్ తదితర వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంటి వెలుగు కార్యక్రమం వల్ల సాధారణ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవలే కొత్తగా 927 మంది వైద్యుల నియామకం జరిపామన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి ఛైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ నీతూ కిరణ్, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్లు పద్మ వినీత, ప్రేమలత, సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్ లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమాచార వారధి.. మీడియా

నవతెలంగాణ కోర్టు క్యాలెండర్‌లు ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల



కోర్టు క్యాలెండర్‌లు ఆవిష్కరిస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలకు, ప్రభుత్వ, సంస్థలకు, న్యాయ వ్యవస్థకు మధ్య సమాచార వారధిగా పత్రికలు, మీడియా గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయని నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్పర్సన్ సునీత కుంచాల అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో నవతెలంగాణ కోర్టు క్యాలెండర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవస్థలు, ప్రజలు నిర్వహించే కార్యక్రమాలు తిరిగి జన సామాన్యులకు వెళ్లడానికి ప్రధాన భూమికను పత్రికలు పోషిస్తున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు న్యాయ సేవ సంస్థ ద్వారా అమలవుతున్న పథకాలు ప్రజలందరికీ చేరవేసే విధంగా కషి చేస్తున్నావని, పత్రికలు మీడియా లేని సమాజం ఊహించలేమని అన్నారు.

సమస్యలు పరిష్కరింపజేయడంలో నవతెలంగాణ ముందు..

సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరింపజేయడంలో నవతెలంగాణ పాటుపడుతుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నవతెలంగాణ క్యాలెండర్‌లను, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవతెలంగాణ టీమ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ రీజియన్ మేనేజర్ సురేశ్, స్టాఫర్ భాస్కర్, డివిజన్ ఇన్‌చార్జిలు గోపి, నవీన్, విలేకరులు రాజు, ప్రవీణ్, శశాంక్‌రెడ్డి, అడ్వకేట్ ఆశ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఇసుక వాహనం ఢీకొని యువకుడు మృతి



నవతెలంగాణ-బిచ్కుంద

ఇసుక లోడ్‌తో వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని హస్గుల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామానికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్ (24) దెగ్లూర్ వెళ్లడానికి హస్గుల్ బస్ స్టాప్ వద్ద నిలబడగా బిచ్కుంద వైపు ఇసుక లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ఢీకొనడంతో అఫ్రోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్ లో నిజామాబాద్ లోని ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు పాలైన అఫ్రోజ్ చికిత్స పొందుతూ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు రోడ్డుపైకి వచ్చి ఏన్బూర, కుర్లా తదితర గ్రామాలకు చెందిన 10 నుండి 20 వరకు బొలెరో వాహనాలు అనుమతులు లేకుండా మంజీర పరివాహక ప్రాంతం నుండి రాత్రి పగలు అనే తేడా లేకుండా 24 గంటలు ఇసుక తరలిస్తూ అతివేగంగా నడపడం వల్లే ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శ్రీధర్ రెడ్డి బొలెరో వాహనాన్ని డ్రైవర్ షేక్ సద్దాం ను అదుపులో తీసుకొని మృతి చెందిన అఫ్రోజ్ బావ షేక్ ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురాతన కట్టడాలను కాపాడుకోవాలి

- కేంద్ర విదేశీ వ్యవహారాల, సాంస్కృతిక శాఖ మంత్రి మీనాక్షి లేఖి
- దోమకొండ కోట సందర్శన

నవతెలంగాణ-దోమకొండ

దేశంలో వారసత్వ పురాతన కట్టడాలు పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్ర విదేశీ వ్యవహారాల, సంస్కృతిక శాఖ మంత్రి మీనాక్షి లేఖి అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని గడికోటను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ కట్టడాలలో రాష్ట్రంలోని గోల్కొండ కోట, దోమకొండ గడి కోటకు గత కొన్ని రోజుల క్రితం యూనేస్కో అవార్డు రావడం చాలా గర్వకారణం అని అన్నారు. కామినేని వారసులు కామినేని అనిల్ శోభన వారి సంస్థనాదిషల వారసత్వ గడి కోట కట్టడాన్ని పరిరక్షించడం చాలా సంతోషమని అన్నారు. అనంతరం గడి కోటలోని మహాదేవ్ ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గడి కోట వారసులు కామినేని అనిల్, మేనేజర్ బాబ్జీ, సీఐ తిరుపతయ్య, పోలీస్ లు తదితరులు పాల్గొన్నారు.


కోటను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

కలిసిమెలసి వ్యాపారం చేసుకోవాలి

- గౌడ కులస్తులకు సూచించిన పోలీసులు
- నవతెలంగాణ కథనం నేపథ్యంలో గ్రామానికి వెళ్లి విచారణ

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలోని గౌడ సంఘం సభ్యుల్లో నెలకొన్న బహిష్కరణ సంఘటనలో భాగంగా మంగళవారము నవతెలంగాణలో వచ్చిన కథనానికి స్పందించిన సిపి నాగరాజు అసలేం జరుగుతుందంటూ సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో స్పందించిన ధర్పల్లి పోలీసులు గౌడ సంఘ ఇరు వర్గ సభ్యులను పిలిపించుకొని జరిగిన సంఘటనపై ఆరాతీశారు. ఈతవనంపై జరిగిన గొడవకు సంబందించిన కారణం అని తెలుసుకొని సంబంధిత అబ్కారి శాఖా అధికారులకు చరవాణిలో మాట్లాడి తెలుసుకున్నారు. దీనితో పాటు సంఘ బహిష్కరణపై ఆరాతీయగా తామెవరము కుల బహిష్కరణ ఎవ్వరికి చెయ్యలేదని, కేవలం రాజేశ్వర్ తమపై కోర్టుకు వెళ్లిన కారణంగా మాపై అపోహలు పెట్టుకున్నాడు తప్ప మేము కూలబహిష్కరణ చెయ్యలేదని సంఘం వారు తెలిపారు. దీంతో సంఘ సభ్యులు అందరు కలిసి మెలసి ఉండాలని గొడవలకు తావులేకుండా కలిసి వ్యాపారం చేసుకోవాలని ఇరువురి అపోహలను దూరం చేసి పంపించారు. కార్యక్రమంలో సిఐ సైదా, ఎస్ఐ వంశీ కృష్ణ రెడ్డి, గౌడ్ సంఘ సభ్యులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

- జిల్లా విద్యాధికారి రాజు

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు డీఈవో రాజు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికొన్నంత పాఠశాలలో మండల స్థాయి మౌలిక సామర్థ్యాల ప్రగతి, ఉపాధ్యాయ బోధన సామాగ్రి మేళను స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ దండబోయిన సంజీవ్ తో కలిసి మంగళవారం డీఈవో ప్రారంభించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బోధన సామాగ్రిని ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యా బోధన ఉండాలని ఉద్దేశంతో జిల్లాలోని మండలాల్లో మొట్టమొదటిసారి ఇలాంటి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని అన్నారు. ఉపయోగపడే ప్రతి బోధన సామాగ్రిని ప్రతి పాఠశాలలో ఏర్పాటుచేసి విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో విద్యా బోధన చేస్తే, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ దశరథ్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి యోసేఫ్ ,మండల నోడల్ అధికారి గోవర్ధన్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజులు, బసవరాజ్, సొసైటీ చైర్మన్ సదాశివరెడ్డి, ఉప సర్పంచ్ పోతు నూరి ప్రసాద్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు మహమ్మద్, యుగేందర్, సురేఖ, విద్యార్థులు, ఆయా గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈవో

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

- నిందితులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు : మంత్రి


పోలీసులతో మాట్లాడుతున్న మంత్రి వేముల

నవతెలంగాణ-వేల్పూర్

పచ్చని జీవితాలను విచ్చిన్నం చేస్తూ ఆరోగ్యకర సమాజాన్ని పాడు చేస్తున్న గంజాయి మహమ్మారిని అంతమొందించాలని నిజామాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అదేశించారు. మంగళవారం నిజామాబాద్ సి.పి నాగరాజు,కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పలువురు పోలీసు అధికారులు మంత్రిని వేల్పూర్ క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల కొద్ది రోజులుగా తరచూ మంత్రి దష్టికి వస్తున్న గంజాయి మహమ్మారి వినియోగంపై పోలీసు అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రాణాంతకంగా మారుతున్న గంజాయి అసలు ఎక్కడి నుండి సప్లయ్ అవుతుంది?ఎక్కడికి సప్లయ్ అవుతుంది?దాన్ని సరఫరా చేసే ముఠా ఎవరు? మహమ్మారి భారిన పడిన వాళ్ళు ఎవరు? అంతమొందించేందుకు ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై మంత్రి కూలంకషంగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామాల్లో గంజాయి సాగు అవుతుందని అధికారులు మంత్రి దష్టికి తీసుకువచ్చారు.వెంటనే ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ తో మంత్రి ప్రశాంత్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ పై చర్యలు తీసుకోవాలి

మంత్రి ప్రశాంత్ రెడ్డి ని కలిసిన బాధిత కుటుంబ సభ్యులు


మంత్రితో మాట్లాడుతున్న గల్ఫ్ బాధితులు

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లాలోని పేద కుటుంబీకులు చిక్కెల స్వామి అనే గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు మంత్రి ప్రశాంత్ రెడ్డిని వేల్పూరులో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ దగ్గర కెఎస్ ట్రావెల్స్ చిక్కెల స్వామి (9010578667) అనే ఏజెంటు ఒక్కొక్కరి నుండి 82 వేల వరకు గత సంవత్సరం ఆగస్టు నెలలో తీసుకున్నాడని తెలిపారు. సెప్టెంబర్లో మస్కట్, ఒమన్ దేశాలకు పంపించాడని కేవలం విజిట్ వీసా ఇచ్చి పంపడం వలన అక్కడ ఎటువంటి ఉద్యోగం దొరకక ఉంటున్నారని తెలిపారు. విజిట్ వీసా కాలపరిమితి నెలలోపే ముగిసినందున మూడు నెలలకు గాను ఒక్కొక్కరికి లక్ష ఇరవై వేలు జరిమానా కట్టమంటున్నారని అన్నారు. పెనాల్టీ కట్టలేమని, నమ్మించి మోసగించిన ఏజెంటు పై చర్యలు తీసుకొని ఇంటికి రప్పించి న్యాయం చేయాలని కోరారు. అంతకు ముందు 230 మంది నుండి 82 నుండి 90 వేల వరకు తీసుకొని దుబాయ్, మలేషియా, మస్కట్ దేశాలకు విసిట్ వీసా మీద పంపి మోసగించినాడని తెలిపారు. చికెలా స్వామిపై పీడీ యాక్ట్ పెట్టి ఇతరులను మోసగించకుండా చూడాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల తుది జాబితా


అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ మహేశ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా తుది ఓటర్ల జాబితా రూపకల్పన జరగాలని ఓటరు జాబితా పరిశీలకులు, మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివద్ధి సంస్థ అదనపు డైరెక్టర్ జనరల్ బి.మహేష్ దత్ ఎక్కా సూచించారు. మంగళవారం ఆయన కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి సమీకత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆయా శాసన సభ నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిశీలన తీరుతెన్నుల గురించి కలెక్టర్ సి.నారాయణరెడ్డి వివరించారు. ఈ సందర్భంగా పరిశీలకులు మహేష్ దత్ ఎక్కా మాట్లాడుతూ, ఈ నెల 05 న ఓటర్ల తుది జాబితాను ప్రదర్శించాల్సి ఉందని, ఎలాంటి లోటుపాట్లు, తప్పులు లేకుండా తుది జాబితాను క్షుణ్ణంగా పరిశీలన చేసుకుకోవాలని సూచించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, అధికారులు సంతోష్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా పనులు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలో రెండు లక్షల ఎంపిటిసి నిధులతో తవ్వించిన బోరుకు మంగళవారం మోటారు బిగించి పట్టణ సర్పంచ్ తునికి వేణు, ఎంపీటీసీ బండి చంద్రకళ రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోడ నరేష్,వార్డు సభ్యులు గంగల సిద్ధమ్మ ,యాదగిరి,నీల శ్యామల భూమయ్య, అంజనేయులు కాలనీవాసులు పాల్గొన్నారు.


బోర్‌ను ప్రారంభించిన సర్పంచ్

ఐఎంఏ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిజామాబాద్ వారి అధ్వర్యంలో స్పోర్ట్ మీట్ కార్యక్రమాన్ని మంగళ వారం ప్రభుత్వ పాలిటెక్నిక్ మైదానంలో నిజామాబాద్ వైద్యులకు 5, 10 కిలో మీటర్ల వాక్, ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్మన్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డా. నీలి రాంచందర్, ప్రధాన కార్యదర్శి డా. జలగం తిరుపతి రావ్, గౌరవ అతిథులు సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, టీఎన్జీవోఎస్ అధ్యక్షులు కిషన్, సీనియర్ వైద్యులు సురేందర్ రెడ్డి, రాంమోహన్ రావ్, ముత్తన్న, బాపురెడ్డి, వినోద్ గుప్తా, రవీంద్ర నాథ్ సూరి, చంద్ర శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్‌మీట్‌లో వైద్యులు

9న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-రామారెడ్డి

మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 9వ తేదీనా సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు ప్రారంభించనున్నట్టు ఎంపీడీవో విజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికను శనివారం లోపు మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని, సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై సమావేశాన్ని దిగ్విజయం చేయాలని సూచించారు.

5న తూంపల్లిలో వైద్య శిబిరం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన 2010- 11 పదవ తరగతి ఏర్పాటుచేసిన హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న తూంపల్లి గ్రామపంచాయతీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రతిభ హాస్పిటల్ వైద్య బృందం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో ఈసీజీ,బీపీ షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని వారు తెలిపారు. రక్తదాన శిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్పల్లి సీఐ బానావత్ సైదా, స్థానిక ఎస్సై నర్సింలు హాజరవుతారని వారు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్ ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్ మహేష్ ప్రశాంత్ వినోద్ రవి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన బోధన్ ఏసీపీ

నవతెలంగాణ-బోధన్

నవతెలంగాణ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం బోధన్ ఏసీపీకిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రజలకు ప్రభుత్వానికి నవ తెలంగాణ అనుసంధానకర్తగా మారి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. అనంతరం ప్రజలకు, నవతెలంగాణ ప్రతినిధులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బోధన్ నవతెలంగాణ విలేకరి లింబూరి లక్ష్మణ్ పాల్గొన్నారు.



విద్యాభ్యాసంలో తొలిమెట్టు విద్యాబోధన కీలకం

- **ఆర్డీవో రాజేశ్వర్**

నిజామాబాద్ జిల్లాలోని పలు పాఠశాలలో టీఎల్ఎం మేళాను మంగళవారం నిర్వహించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుల్లో తమ బోధన పరికరాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మేళాను సందర్శించారు. బోధనా పరికరాలతో నాణ్యమైన విద్యను అందించవచ్చని అన్నారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్:విద్యార్థుల మౌళిక భాష, గణిత సామర్థ్యాల సాధనకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిమెట్టు కార్యక్రమం కీలకమని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెసి) లో నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువును సులభంగా అర్థం చేసుకోవడానికి టీఎల్ఎం కార్యక్రమంలో ప్రదర్శించిన బోధనా ఉపకరణాలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయని అన్నారు. అనంతరం ఆయన బోధనా ఉపకరణాలను పరిశీలించారు. వాటి గురించి తెలుసుకొని ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, జిల్లా అధికారి నర్ర రామారావు, బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్, నోడల్ అధికారి నాగయ్య, కౌన్సిలర్ శరత్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడపల్లి:నేటి బాలలే రేపటి పౌరులని, బాల బాలికల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషి చాలా గొప్పదని ఎంపీపీ కే శ్రీనివాస్, జెడ్పి ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత తెలుగు మీడియం పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గణితం, సామాన్య, సాంఘిక, ఆంగ్లం, తెలుగు, ఇతరత్రా సబ్జెక్టులకు సంబంధించిన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను మన ఊరు మన బడి కింద ప్రత్యేక నిధులు మంజూరు చేసి ప్రతి పాఠశాలను మోడల్ పాఠశాలగా మార్చాలనేది సీఎం కేసీఆర్ లక్ష్మన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామారావు, సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, టీఎస్ఆర్‌జేసీ కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్ సువాసిని రెడ్డి, కళాశాల ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మాధురి, ప్రధానోపాధ్యాయులు నరేందర్, సుశీల్ కుమార్, మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

(వేల్పూర్)ఆర్మూర్:ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల టీ ఎల్ ఎం మేళా నిర్వహించారు. వివిధ పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుల్లో తమ బోధన పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా టీఎల్ఎం మేళాను ఎంపీపీ బీమ జమున ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి వనజారెడ్డి మాట్లాడుతూ... బోధన పరికరాలతో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించవచ్చని అన్నారు. మండల నోడల్ అధికారి లింగన్న మాట్లాడుతూ.. మండల స్థాయిలో తయారుచేసిన ఈ బోధన పరికరాలను అన్ని పాఠశాలలు వినియోగించుకోవాలని అన్నారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు రాజన్న మాట్లాడుతూ బోధన పరికరాలతో గుణాత్మక విద్య అందించాలని అన్నారు. మండల రిసోర్స్ పర్సన్లు సయ్యద్ బాషిద్, నరేష్ ప్రశాంత్, శ్రావణ్ కుమార్‌న్యాయ నిర్ణయితలుగా విజేతలను ప్రకటించారు. తెలుగులో మొదటి స్థానం కుకునూరు పాఠశాల రెండవ స్థానం వేల్పూర్ పాఠశాలకు దక్కింది. ఆంగ్లంలో అంక్సాపూర్ అమీనాపూర్ గణితంలో అక్కులూరు, పడగల్ పాఠశాలలు పరిసరాల విజ్ఞానంలో రామన్నపేట, పచ్చల నడుకుడ పాఠశాలలు గెలుపొందాయి. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్షులు గంట అశోక్, ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్, రాజేందర్, రామచందర్, ఉపాధ్యాయులు మల్లేష్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో మేళాను తిలకిస్తున్న అధికారులు, మున్సిపల్‌చైర్మన్, తదితరులు

మెండోర :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్ఎం మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బురుకల సుకన్య కమలాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వర్, నోడల్ అధికారి సాయన్న, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఆరాధన, మనోహర్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

కంఠేశ్వర్:నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో మండల స్థాయిలోని ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠశాలలో బోధించే విభిన్న పద్ధతుల రూపంలో ఏర్పాటు చేసిన వాటిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ మాట్లాడుతూ.. కరోనా వైరస్ ప్రభావం వల్ల విద్యార్థులు చదువుకు దూరమై విద్య ప్రమాణాలను అందుకోలేక పోయారని గ్రహించిన ప్రభుత్వం విద్యార్థులకు సులభంగా అర్థమైయ్యే విధంగా ఏ విధంగా బోధిస్తే అర్థమవుతుందో పట్టిక ద్వారా చేస్తున్న ప్రయత్నాలను అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావ్, రమేష్ రెడ్డి, వివిద పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెంజల్:తొలి మెట్టులో భాగంగా విద్యా బోధన ఉపకరణాల మేళా నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు తెలిపారు. మండలంలోని సాటాపూర్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటుచేసిన మేళా సందర్భంగా ఎంపీపీ రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్ లు జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులు లో కాస్ట్, నో కాస్ట్ పరికరాల ద్వారా ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఉపకరణాలను తయారు చేశారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీయడానికి ఇవి చాలా ఉపకరిస్తాయని వారన్నారు. కార్యక్రమంలో సాటాపూర్ సర్పంచ్ ఏకార్ భాష, రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, బాగేపల్లి సర్పంచ్ పాముల సాయిలు, పి ఆర్ టి యు మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయి రెడ్డి, మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాయకులు రాఘవేందర్ పాల్గొన్నారు.



ఎడపల్లి: మేళాలో ప్రదర్శనల గురించి వివరిస్తున్న ఉపాధ్యాయులు

గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర శివారులోని నాగారంలోగల గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మెస్ మేనేజర్ (గెస్ట్), లాబ్ అసిస్టెంట్ (ఔట్ సోర్సింగ్), కేర్ టేకర్ (ఔట్ సోర్సింగ్) పోస్టుల భర్తీకి దరాఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ టి. సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెస్ మేనేజర్ (గెస్ట్ పద్దతి) పోస్ట్ కు ఎంఎస్సీ(న్యుట్రిషియన్, ఫుడ్ సైన్స్) లేదా బీఎస్సీ(న్యుట్రిషియన్, ఫుడ్ సైన్స్) కోర్సు, లాబ్ అసిస్టెంట్ పోస్ట్ (అవుట్ సోర్స్) కు బీఎస్సీ (లైఫ్ సైన్స్), కేర్ టేకర్ పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ అర్హతలు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12 లోపు నిజామాబాద్ నగర శివారులోని నాగారంలోగల గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో దరఖాస్తు సమర్పించాలని కోరారు. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, మెరిట్ ఆధారంగా జిల్లా అదనపు కలెక్టర్ ఆమోదంతో ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు.

మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎస్ఐ రాజశేఖర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర రోడ్లు భవనాలు గృహ నిర్మాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కమ్మర్ పల్లి ఎస్ఐ రాజశేఖర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మంత్రికి వేల్పూర్ క్యాంప్ కార్యాలయంలో ఎస్ఐ రాజశేఖర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ

అర్‌వో ప్లాంట్, టాయిలెట్ నిర్మాణానికి సాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న కావేటి వినోద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక బోర్గాం (పి) నందుగల భీమ్‌రావునగర్ కాలనీలో టాయిలెట్లు, ఆర్ వో ప్లాంట్ నిర్మాణానికి అంతర్జాతీయ న్యాయవాది కావేటి శ్రీనివాస్ కుమారుడు కావేటి వినోద్ మొదటివిడత ఆర్థికసాయం కొంతమొత్తం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సభ్యులు ఆప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నిజామాబాద్ అధ్యక్షులు సతీష్ షాహ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విశాల్ ఆకుల, మాజీ అధ్యక్షులు దర్శన్ సింగ్ సోకి, ు కాలనీ సభ్యులు నరేష్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా వినయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వైద్యులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా వినయ్ కుమార్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డాక్టర్లు ఈ ఆరోగ్య కేంద్రాన్ని నడిపించారని, ప్రస్తుతం సీనియర్ డాక్టర్‌గా వినయ్ కుమార్, జూనియర్ డాక్టర్‌గా సహిస్తా పిర్దోష్‌లు బాధ్యతలు చేపట్టారు. వారికి వైద్య సిబ్బంది బోకేలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారులు శ్రావణ్ కుమార్, కరిపే రవీందర్, పీహెచ్‌ఎన్ రాణి, ఆరోగ్య సూపర్వైజర్ మాలాన్‌బి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు శ్రీధర్ రెడ్డి మరణం తీరని లోటు

నవతెలంగాణ-కంఠేశ్వర్

1969 ప్రత్యేక తెలంగాణోద్యమ నాయకుడు, కవి, రచయిత, స్నేహశీలి డాక్టర్ ఎం. శ్రీధర్ రెడ్డి మరణం తీరని లోటని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్, జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, తెలంగాణ భాషా సాహితి సాంస్కృతిక వేదిక అధ్యక్షులు పంచ రెడ్డి లక్ష్మణ్, ఎనిశెట్టి శంకర్, వీపీ చందన రావు, తిరుమల శ్రీనివాస్ ఆర్య, గుత్ప ప్రసాద్, సాయిబాబు తదితరులు ప్రగాఢ సంతాపాన్ని అన్నారు. ఆయన సో మవారం హైదరాబాద్‌లో మరణించారని తెలిపారు.

5న విద్యుత్ వినియోదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ నెల 5 న విద్యుత్ వినియోదారుల సమస్యల పరష్కార వేదిక సీజీఆర్ఎఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నట్టు డిచ్‌పల్లి ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్పల్లి సబ్‌స్టేషన్‌లో (డిచ్‌పల్లి సెక్షన్, ఇందల్‌వాయి సెక్షన్, ఎల్లారెడ్డిపల్లి, ధర్పల్లి సెక్షన్ నియోగదారుల సమస్య లపై ధర్పల్లి సబ్ స్టేషన్‌లో మొబైల్ కోర్ట్ నిర్వహించబ డుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కౌమార దశపై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్

బాల్కొండ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం భోజన విరామ సమయంలో 8,9,10వ తరగతుల విద్యార్థులకు కౌమార దశలో కలిగే మార్పుల గురించి 'వర్ధ్ సంస్థ' ఆధ్వర్యంలో అవగాహన కల్పించారని ప్రధానోపాధ్యాయులు ఇందిరా తెలిపారు. 'వర్ధ్ సంస్థ' సిబ్బంది కే.విజయ్ కుమార్, కిరణ్మయి బాలబాలికలకు వేర్వేరుగా కౌమార దశలో కలిగే మార్పులను సంక్షిప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

డంపింగ్ యార్డ్ పర్యవేక్షించిన మేయర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాగారంలో ఉన్న డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న బయో మైనింగ్ పనులను మేయర్ పర్యవేక్షించారు. నగర చుట్టు పక్కల నుండి తరలించిన చెత్త ద్వారా ఎరువును తయారు చేసే పనుల పురోగతిని పరిశీలించారు. చెత్త తరలింపు వాహనాలను తనిఖీ చేసి వాహనాలు నిండే వరకు చెత్తను సేకరించాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ చెత్తరహిత నగరంగా తీర్చటానికి ఎంతో కృషి చేస్తుందని, అందుకు ప్రజల సహకారం అవసరమని చెత్త ఉత్పత్తి తగ్గేలా ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం నగరంలోని 300 క్వార్టర్స్ బస్తీ దావాఖానాను తనిఖీచేసి అందుతున్న సేవలను పరిశీలించి రోగులను అడిగి తెలుసుకున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. బండి గంగారాంకు రూ.60వేలు, సుంకరి జనార్దన్‌కు 5500 రూపాయల చెక్కులను సర్పంచ్ నీరడీ రాజేశ్వర్ అందచేశారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్/మోర్తాడ్

మండల కేంద్రంలో మంగళవారం రైతువేదికలో కల్యాణ లక్ష్మీషాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మండల ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పంపిణీ చేశారు. మండలంలో 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ (23), షాది ముబారక్ (01), మంజూరైనట్లు తహశీల్దార్ విక్రమ్ తెలిపారు. ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ పేద, బడుగుబాలహీన వర్గాల వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయం గుర్తుచేశారు. అందులో భాగంగానే పేదింటి ఆడపడుచుల వివాహ నిమిత్తం వారి వారి కుటుంబాలను ఆదుకునే దిశలో ఈ కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకాలు ఆముల్లోకి తెచ్చారని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, సర్పంచులు ఆకుల రాజారెడ్డి, జక్క గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ, కె.యం రెడ్డి, పార్టీ నాయకులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్:మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 47 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఎంపీపీ శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహ సమయంలో పెళ్లి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవి, తహసీల్దార్ బాబన్న, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ

ఉత్తమ పాఠశాలగా నలంద హైస్కూల్

- **డీఈఓతో సత్కారం**

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన ఎంఆర్‌సి టీచర్ అవార్డ్స్‌లో బెస్ట్ టీచర్స్ అవార్డ్ ఫంక్షన్‌లో మామిడిపల్లి నలంద స్కూల్ కు మండలంలో బెస్ట్ అడ్మినిస్ట్రేషన్ అవార్డును దక్కించుకుంది. అర్బన్ మండలం లోని ఎంఈఓ, ప్రభుత్వ ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ, సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బెస్ట్ టీచర్స్, బెస్ట్ అడ్మినిస్ట్రేషన్ స్కూల్‌ను సన్మానించుకోవడం జరిగింది. కార్యక్రమంలో నలంద హై స్కూల్‌ను మండలంలో ఉత్తమ స్కూల్ అవార్డును కరస్పాండెంట్ లక్కారం రాజేంద్ర ప్రసాద్ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, మండల విద్యాధికారి రాజా గంగారం, ఎంపీపీ పస్కా నర్సయ్య చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కరెస్పా ండెంట్ ప్రసాద్ మాట్లా డుతూ ఈ అవార్డు రావడానికి కృషిచేసిన ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఇట్టెం గోపాల్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్‌ను సన్మానించిన డీఈవో

జక్రాన్‌పల్లి గౌడ సంఘంపై బహిష్కరణ ఎత్తివేత

- **స్వచ్ఛమైన కల్లు మాత్రమే అమ్మాలి**
- **గ్రామాభివృద్ధి కమిటీ గౌడ సంఘంతో చర్చలు జరిపిన ఏసీపీ, ఆర్డీఓ**

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లి గౌడ సంఘంపై బహిష్కరణ ఎత్తివేసినట్టు నిజామాబాద్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీతో సమావేశం నిర్వహించి ఇరు వర్గాలతో చర్చించారు. స్వచ్ఛమైన కల్లు అమ్మాలని, చుట్టుపక్కల గ్రామాల్లోలా 11 రూపాయలకు సీసా అమ్మాలని గ్రామాభివృద్ధి కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఏసీపి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా మాట్లాడినా, పని చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ... గ్రామంలో ప్రతి ఒక్కరు సామరస్యంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు జక్రాన్‌పల్లి సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీ తలారి మరియ సతీష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్, తహసీల్దార్ మల్లేష్ , మండల కో ఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.



వీడీసీ, గౌడసంఘ వారిలో మాట్లాడుతున్న ఏసీపీ, ఆర్డీవో

ఆయిల్‌ఫామ్‌తో ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం

- **ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన**

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని గడ్కోల్ గ్రామంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగు పైన అవగాహన కల్పించారు. మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నిజామాబాద్‌జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి నర్సింగ్ దాస్ మాట్లాడుతూ.... ఆయిల్ ఫామ్ పంటను సాగు చేస్తే ఒక ఎకరానికి లక్ష రూపాయల వరకు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. ఎకరానికి 50 మొక్కలు అవసరం అవుతాయని, మొక్క ధర 193 రూపాయలు కాగా అందులో 173 రూపాయలు సబ్సిడీ పోను 20 రూపాయలు రైతు డిడి చెల్లించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేయాలనుకున్న రైతులు పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు ఇవ్వాలని అన్నారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ.... ఈ యాసంగిలో రైతులు వరికి బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫ్రీ యూనిక్ ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా మేనేజర్ గంగాధర్, ఏఈవో శివాని, సర్పంచ్ దేవగౌడ్, ఎంపీటీసీ గంగారాం, రైతుబంధు అధ్యక్షులు మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారి నర్సింగ్‌దాస్

ఎడపల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభించాలని వినతి

నవతెలంగాణ-బోధన్

ఎడపల్లిలోని రైల్వేస్టేషన్‌ను పున:ప్రారంభించాలని కోరుతూ మంగళవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ రైల్వే స్టేషన్లో రైల్వే స్టేషన్ మాస్టర్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడపల్లి, శక్కర్ నగర్‌లో రైల్వేస్టేషన్లు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. 2019లో పనులు చేస్తున్నామని ప్రకటించిన అధికారులు, మూడు నెలల్లో పనులను పూర్తి చేస్తామని ఇప్పటివరకు జాడ లేకుండా పోయారన్నారు. ఇప్పటికైనా ఎంపీ అరవింద్ ఈ రైల్వే స్టేషన్లను పున ప్రారంభించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు గుమ్ముల గంగాధర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం బోధన్ డివిజన్ కార్యదర్శి షేక్ నసీర్, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
బుధవారం 04 జనవరి 2023

నిబంధనలు పాటించని హెూటల్ మేనేజ్మెంట్ కళాశాల పై చర్యలు తీసుకోండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిబంధనలు పాటించని హెూటల్ మేనేజ్మెంట్ కళాశాల పై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జైత్రాం రాథోడ్ అన్నారు. ఏఐయస్ఎఫ్, టీవీయూవీ, గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇన్ఫినిటీ, మయూర్ హెూటల్ మేనేజ్మెంట్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం జిల్లా అగ్ని మాపక శాఖ అధికారి మురళి మనోహర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. కార్యక్రమంలో టివీయూవీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రమావత్ లాల్ సింగ్, ఏఐయస్.యఫ్, జిల్లా కార్యదర్శి రఘురాం, సందీప్, సుభోద్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెళకువలపై అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

సాగులో మెళకువలపై మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ రైతు వేదికలో మంగళవారం గ్రామ రైతులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. పద్మపాని సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ అమృతరాజేందర్ రైతులకు క్షేత్ర స్థాయిలో వరిలో తడి సాగు పొడి సాగులో పాటించాల్సిన మెలుకువలు, నీటి పొదుపు వినియోగం, తెగుళ్ల నివారణ, దోమపోటు నివారణ, మీథేన్ వాయువు తగ్గింపు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ రెడ్డి గోపాల్, సర్పంచ్ జానకి, ఎంపీటీసీ లక్ష్మి శ్రీనివాస్ ప్యాక్ చైర్మన్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడు బస్వంత్ రావ్ పటేల్ అధ్వర్యంలో మంగళ వారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

నేడు టీఎల్‌ఎమ్ మేళా

నేడు (బుధవారం) టీఎల్‌ఎమ్ మేళా మండల స్థాయిలోని అన్ని పాఠశాలల వారికి ఉంటుందని, మండలంలోని ప్రతి ఒక్క పాఠశాలల ఉపాధ్యాయులు తప్పక మండల కేంద్రంలోని ప్రైమరి స్కూల్ హెచ్‌ఎమ్ సహదేవ్ సారథ్యంలో బోధన స్థాయి కృత్యాల మేళ కొనసాగుతుందని, అందరు ఉపాధ్యాయులు తమతమ చాట్ లను తీసుకోని రాగలరని జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎమ్ బస్వంత్ పేర్కొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

నవతెలంగాణ-రామారెడ్డి



కార్డులు చూపుతున్న కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ అన్నారు. మండలంలోని రెడ్డిపేట్‌లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు లో భాగంగా, కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించడంతో, వారికి బీమా కార్డులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దన్ సింగ్, నాయిని నర్సింలు, శంకర్, బాలయ్య, ఇర్షాద్, జావిద్, కాసిం, హరీష్, జైనోద్దీన్, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్లాంకెట్‌ల పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్



బ్లాంకెట్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలం లోని ధర్మారావు పేట్ గ్రామంలో పలువురికి బ్లాంకెట్‌లను సర్పంచ్ బడాల భాస్కర్ రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి ఒక బ్లాంకెట్ చొప్పున రెన్యూ పవర్ ప్లాంట్ సహకారంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

నవతెలంగాణ-భిక్కనూర్



దంపతులను సన్మానిస్తున్న చైర్మన్

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదని మండలం లోని అంతంపల్లి సొసైటీ చైర్మన్ వల్లకొండ వెంకట్ రెడ్డి తెలిపారు. గత నెల 31వ తేదీన ఆల్ ఇండియా రేడియో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేసిన గ్రామానికి చెందిన వల్లకొండ మల్లారెడ్డి దంపతులను మంగళవారం గ్రామంలోని వల్లకొండ రెడ్డి సంఘం అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజుల సంజీవరెడ్డి, గ్రామ రైతు బంధు కన్వీనర్ గంగారెడ్డి, వల్లకొండ సంఘం సభ్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాటి హనుమాన్ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ

మండల కేంద్రం శివారులోని పాటి హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాటి హనుమాన్ దేవాలయంలో అన్న ప్రసాదం ప్రారంభించి తొమ్మిది సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తుల సహకారంతో గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతి శనివారం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధితోపాటు, అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

చదువులతల్లి.. సావిత్రిబాయి ఫూలే

- ఘనంగా జయంతి వేడుకల
- మహిళలు అన్ని రంగాల్లో ఎదిగే విధంగా ప్రోత్సహిస్తేనే ఆమెకు నివాళి
- సమసమాజ స్థాపనకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ



జుక్కల్‌లో నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



కామారెడ్డి డిగ్రీ కాలేజీలో..



లింగంపేట్ మండలం సజ్జన్‌పల్లిలో..

నవతెలంగాణ-విలేకరులబృందం

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు.. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని పలువురు పేర్కొన్నారు. వెనుకబడిన సామాజిక వర్గానికి అక్షర దీపంగా వెలిగారని, స్త్రీలు వంటింటికే పరిమితమైన రోజులలో తానే ముందు నిలిచి స్త్రీలను విజ్ఞానవంతులుగా చేసిన మహనీయురాలని కొనియాడారు. ఆమె జయంతి పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

జుక్కల్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త తోలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే 192వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఫిర్దోస్ మాట్లాడుతూ పురుషులతో సమనత్వాన్ని తీసుకొచ్చిన నిప్పురవ్వ సావిత్రి బాయి పూలే అని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సాగర్, నాయకులు సాయికిరణ్, అర్మన్ శైలేష్, దివ్య రాజమణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జన పల్లి పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు

లింగంపేట్ : లింగంపేట్ మండలంలోని సజ్జనపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రి బాయి పూలే అని అన్నారు. ఆమె జీవితం నేటి సమాజానికి ఆదర్శనీయం అన్నారు. ఆమె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయిని పద్మను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బన్సీ, జాకిర్, సంగమేశ్వర్ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్ : మద్నూర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో మహిళా ఉపాధ్యాయులకు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రవీందర్, సంఘం అధ్యక్షులు బండి వార్ విజయ్, మండల అధ్యక్షులు ఎస్ గంగారాం, సర్పంచ్ సురేష్, ఉప సర్పంచ్ విట్టల్, ఎంపిటిసిలు సాయిలు సంగీత కుశాల్ అనుష బాయి శివాజీ మండల విద్యాశాఖ అధికారి రాములు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : రాజంపేట్ మండలం ఆరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి అన్నారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అంకం శ్యామ్ రావు హాజరై మాట్లాడుతూ... భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని అన్నారు. ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి అని, సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త అని అన్నారు. విద్య ద్వారానే మహిళా లోకానికి విముక్తి అని బలంగా నమ్మి దేశంలోనే మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే అని ప్రతి ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, ఆంజనేయ ప్రసాద్, విద్యా వాలంటరీలు మాధురి, భాగ్య, అశ్విని, అమల, రజిత, తల్లిదండ్రులు అంకం సుధాకర్, అంగన్వాడి టీచర్లు స్వరూప, శోభ, పాఠశాల సిబ్బంది సంజువ్, శ్యామల, లక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ చైతన్యమూర్తి సావిత్రి బాయి పూలే

పిట్లం : ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. మంగళవారం మండల బీసీ సంక్షేమ సంఘం, మద్దెల్ చెర్వు గ్రామ సోషల్ వర్క్ టీం ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్ , జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి యాదగిరి, ప్రెసిడెంట్ అశోక్ రాజ్ , సోషల్ వర్క్ టీం మెంబర్స్ ఉపాసి రాజేంద్ర రావు , గైని సురేష్ , విట్టల్ గౌడ్, నవీన్ గౌడ్ , మాజీ సర్పంచ్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : గాంధారి మండలంలోని తిప్పారం తాండా ప్రాథమిక పాఠశాలలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలను శారద, స్వప్న సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారాం, ఉపసర్పంచ్ గంగారాం, రవీందర్, సాయన్న చైర్మన్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో మంగళవారం బీసీ సంఘం , అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వికెవి ఫంక్షన్‌హాల్ ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతల శంకర్, ఎల్లారెడ్డి మండల బిసి సంఘం అధ్యక్షులు కురుమ సాయిబాబా, అంబేద్కర్ సంఘం ఎల్లారెడ్డి డివిజన్ ఇంచార్జ్ బిట్ల సురేందర్ మరియు ఎస్సీ ఎస్టీ బీసీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కసీరామ్, జాతీయ బీసీ సంఘం జిల్లా యువత అధ్యక్షులు రాజీవ్ కుమార్ ప్రధాన కార్యదర్శి అఖిల్ రావు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ దినత్సోవంగా ప్రకటించాలి

కామారెడ్డి టౌన్ : సావిత్రబాయి పూలే జయంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ప్రకటించాలని కామారెడ్డి జిల్లా జై భీమ్ ఆర్మీ అధ్యక్షుడు మహేష్ రావణ్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే విగ్రహాలకు భీం ఆర్మీ కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాకేష్, సంతోష్, నవీన్, గణేష్, కళ్యాణ్, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని పద్మాజివాడి గ్రామంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దెల బాగయ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం పద్మాజివాడి పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్రవాటి లింగారెడ్డి, మామిండ్ల నాగయ్య, కవీన్, కాశయ్య పాల్గొన్నారు.

సమ సమాజాన్ని నిర్మిద్దాం

కామారెడ్డి టౌన్ : సావిత్రబాయి స్ఫూర్తితో సమా సమాజాన్ని నిర్మిద్దామని బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవియం విఠల్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సమాజంలో మహిళ విముక్తి విద్యతోనే ముడిపడి ఉందని గ్రహించి అసమానతలను రూపుమాపాలని కులం మతం భేదం లేకుండా అందరికీ విద్యను అందించాలని అగ్రకుల ఆధిపత్యం దాడులు చేసినా వెనకడుగు వేయకుండా మహిళ అభ్యుదయకోసం కృషి చేసిన మహనీయురాలు సావిత్రి పూలే అన్నారు. మహిళల హక్కుల కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన న్యాయశాఖ మంత్రికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలని విద్య , వైద్యం, ఉపాధి, పారిశ్రామికంగా, రాజకీయంగా ఎదిగే విధంగా నేటి సమాజం ప్రోత్సహించాలన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు మాట్లాడుతూ మహత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే ఫాతిమా షేక్ లాంటి మహనీయులు కృషి ఫలితంగా దేశంలో అందరికీ విద్యను అందుతుందని మహనీయుల ఆలోచన విధానాన్ని కొనసాగించాలని అన్నారు. మహిళలు మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. మహిళలపై దాడులు అరికట్టాలని వారి జీవిత చరిత్రలను చదివి సమాజానికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శి ప్రసన్నకుమార్, బులెట్ ప్రభకర్, యశ్వంత్ కళాశాల అధ్యాపకులు శంకర్, చంద్రకాంత్, రాజ్ కుమార్, రామస్వామి, మహిళా ఆధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో..



పిట్లంలో..



గాంధారి మండలం తిప్పారం తండాలో..

పీఆర్టీయూ క్యాలండర్‌ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ధర్పల్లి/ఏర్గట్ల/రెంజల్

పీఆర్‌టీయూ 2023 క్యాలండర్ ను మంగళవారం ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉపాధ్యాయుల సమస్యలు తెలిపితే రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయు మండల అధ్యక్షుడు వెంకట్ రాజా రెడ్డి, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, ప్రసన్న కుమార్, సుజాత, స్నేహలత, జేమ్స్ వినోద్ కుమార్, ప్రవీణ్ రెడ్డి, ఫారూఖ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ క్యాలెండర్‌లు ఆవిష్కరిస్తున్న మంత్రి వేముల

ఏర్గట్ల : పీఆర్‌టీయూ క్యాలెండర్ ను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూమండలాధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు గౌడ్, తుమ్మల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని సాటాపూర్ గ్రామంలో మంగళవారం ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసీ మేక విజయ సంతోష్, ఎంపీడీవో శంకర్ ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయి రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి గణేష్ రావు, సాటాపూర్ సర్పంచ్ ఏ కార్ పాషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాసరావు, ఆంజనేయులు, వెంకటలక్ష్మి, అంబేద్కర్ నగర్ సర్పంచ్ మధుర భాయ్, రాష్ట్ర అసోసియేట్ కన్వీనర్ రాజేందర్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని సీతారాంపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంపిపి కానుగంటి శారదా నాగరాజు ప్రజా ప్రతినిధులు సందర్శించి భోజన వసతులను సిబ్బంది పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా మాట్లాడుతు పాఠశాలలోని విద్యార్థినిలకు ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజన వసతులు కల్పించాలని, విద్యార్థి నిలకు మంచి బోధన అందించి ఉత్తమ ర్యాంకులు వచ్చేలా ఉపాధ్యాయురాలు కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో తిరుపతి రెడ్డి, సర్పంచ్ జలిగామ నాంపల్లి గారు ఎంపీటీసీలు నిమ్మ శంకర్ కడారి రమేష్ ప్రిన్సిపాల్ మమత తదితరులు పాల్గొన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

ఆలయాలను సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్

నవతెలంగాణ-రామారెడ్డి/భిక్కనూర్

మండలంలోని ఇసన్నపల్లి(రామారెడ్డి) లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సందర్శకుల కోసం అన్ని ఏర్పాట్లను చేశారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం సుప్రియకు ఆలయ కమిటీ, అధికారులు శాలువాతో సన్మానించి, స్వామి వారి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఈవో ప్రభు, కమిటీ సభ్యులు రాజేందర్ గౌడ్, రైతుబంధు మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, సంతోష్ గుప్తా, ఆలయ పూజారులు శ్రీనివాస్ శర్మ, సురేందర్ గుప్తా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





రామారెడ్డి : దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియను సన్మానిస్తున్న ఆయలకమిటీ.. భిక్కనూర్‌లో

సిద్ధిరామేశ్వర ఆలయంలో పూజలు

భిక్కనూర్ : మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధిరామేశ్వర ఆలయాన్ని మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ నూతన సహాయ కమిషనర్ సుప్రియ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ సహాయ కమిషనర్ కు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు షాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలభైరవ స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి బుర్ల ప్రభు, అర్చకులు,సిబ్బంది, పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ సింగిల్ విండో క్యాలెండర్‌ను సొసైటీ చైర్మన్ భూమయ్య మంగళవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఉప్పరి సాయిలు, నర్మాల రామచంద్రం, కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, కళాశాల యజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతనంగా ఇద్దరు డాక్టర్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్మాన్‌తో పాటు సిరిసిల్ల జిల్లా గంబీరావు పేట్ మండలం నుండి శిరీష బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్లు ఇద్రీజ్ ఘోరి పదోన్నతి పై నిర్మల్ జిల్లా బైంసాకు వెళ్ళారు. డాక్టర్ అర్జుమన్ నజీరా పదోన్నతిపై తాడ్వాయి మండలం ఎర్రపహడ్‌కు బదిలీ అయ్యారు.

రైలు నుండి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-భిక్కనూర్

రైలు నుండి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మధ్యాహ్నం భిక్కనూర్ అక్కన్నపేట్ రైల్వే స్టేషన్ మధ్య చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై తావు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం నడుస్తున్న రైలు నుండి ప్రమాదవశాత్తు గుర్తుతెలియని 45 సంవత్సరాల వ్యక్తి జారీ పక్కనే ఉన్న కంకర పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే స్థానిక రైల్వే పోలీస్ లను సంప్రదించాలని ఆయన కోరారు.

అడవి పంది దాడిలో మేక మృత్యువాత

నవతెలంగాణ-పిట్లం

అడవి పంది దాడిలో మేక మృత్యువాత పడిన ఘటన పారేడుపల్లి శివారులో మంగళవారం చోటు చేసుకుంది. అటవీ శివారులో గల తన పొలం పక్కన మేకలు మేత వేస్తుండగా అడవి ప్రాంతము నుండి ఒక అడవి పంది మేకపై దాడి చేయటంతో మృతిచెందినట్లు బాధితుడు పండరి తెలిపారు.

అనుదినం జనపక్షం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల మొండి వైఖరి వీడాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గత నెలరోజులుగా ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఏఓ ప్రశాంత్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టిపుల్ క్వశ్చన్ విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ని అమలు చేయాలని, తప్పుడు ప్రశ్నలకు మార్కులు కలపాలని, ఈవెంట్స్‌ని పాత పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. రన్నింగ్‌లో క్వాలిఫై అయినవారికి మెయిన్స్‌కి అవకాశం ఇవ్వాలని కోరారు. చనిపోయిన అభ్యర్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, జిల్లా కార్యదర్శి రంజిత్, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా కమిటీ సభ్యులు సుభోద్, మదు నగర నాయకులు రాజేష్, కానిస్టేబుల్ అభ్యర్థి వెంకటేష్ పాల్గొన్నారు.

బోధన్ జిల్లాగా ప్రకటించేవరకూ దీక్షలు

వంటావార్పులో చేపట్టిన న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు దీక్ష స్థలి వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బోధన్ ను జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని అన్నారు. బోధన్ జిల్లా కేంద్రంగా ఏర్పడితే సమీప ప్రాంతాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని దానికి తగిన మౌలిక సౌకర్యాలు బోధన్ లో ఉన్నాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఈశ్వర్, అడ్లూరు శ్రీనివాస్, రమేష్, హనుమంతరావు, దత్తాత్రి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతిని
జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

- సావిత్రిబాయి పూలేకు ఘన నివాళ్లు
- మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సావిత్రిబాయి పూలే :సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-విలేకరులబృందం

సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని పలువురు అన్నారు. సావిత్రిబాయి 192వ జయంతి సందర్భంగా పలుసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి స్త్రీల విద్యాకోసం ఆమె చేసిన సేవలను కొనియాడారు.

డిచ్‌పల్లి:తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు ఘనంగా నివాళు లర్పించారు. యూనివర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, జయంతి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని, స్త్రీలకు విద్యను అందించడం కోసం, సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడం కోసం కృషి చేసిన సామాజిక సంఘసంస్కర్త అని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా సాధికారత సమసమాజ స్థాపన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని, డాక్టర్ రవీందర్ రెడ్డి , డాక్టర్ త్రివేణి , డాక్టర్ జమీల్ విద్యార్థి నాయకులు అక్షయ్, ఆకాష్ అశ్విత్, శేషు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

తెలంగాణ యూనివర్సిటీలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ ప్రభంజన్ పాల్గొని మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి, కుల వ్యవస్థకు, పితృ సామ్యానికి వ్యతిరేకంగా పోరాడిన మహిళ అని అన్నారు. అనంతరం లక్కాకుల యాకన్న ప్రాస రూపంలో 'విద్య కై మీరు బాటలు వేస్తే ఉద్యమానికై మీ మాటలు మేము నెరవేరుస్తాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ సెక్రెటరీ శ్రీశైలం, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్ , యూనివర్సిటీ కమిటీ సభ్యులు దినేష్, కార్తీక్ పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో పీడీఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, యూనివర్సిటీ కన్వీనర్ కర్క గణేష్ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వంతో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్న మహిళగా, మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం సంఘ సంస్కర్త స్టాంపు సావిత్రిబాయి పూలే పేరుపై ముద్ర కావడం విశేషమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.కె అషఉర్, నాయకులు రాజేష్, స్వర్ణలత, అభిషేక్, నవ్య, రాజశ్రీ, దివ్య, అఖిల విద్యార్థులు పాల్గొన్నారు.

సిరికొండ:మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సీతాదేవి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సైరా సత్యం, మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య సావిత్రబాయి చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు.

కంఠేశ్వర్:సావిత్రమ్మ పూలే జీవత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సావిత్రమ్మ చౌక్ (కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా) లో జరిగిన కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్-బిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దండి వెంకట్, ఎస్.సిద్ధిరాములు మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ మహిళలకు శూద్రులకు విద్య నిషేధించిన మనుధర్మ శాస్త్రాన్ని ధిక్కరించి మహిళలకు రక్షణగా ఉన్నారన్నారు. కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా ను సావిత్రమ్మ పూలే చౌక్‌గామార్చి ఆమె విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, బిసి ఉద్యమ నాయకులు బాస రాజేశ్వర్, బహుజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి దండు జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఆకుల సుజాత, బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నగర బిఎల్‌టియు కార్యదర్శి గంగా శంకర్, జిల్లా నాయకులు సయ్యద్, బిసి కులాల ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఆర్.నర్సింహులు,బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా కో- కన్వీనర్ డి.రాజు, నిజామాబాద్ రూరల్ మండల కన్వీనర్ రాజాగౌడ్ పాల్గొన్నారు.



సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలవేస్తున్న మేయర్



సావిత్రిబాయికి నివాళ్లు అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మాధవి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. చదువు ఒక్కటే సమాజాన్ని మార్చగలదని సావిత్రిబాయి పూలే తాను చదువు నేర్చుకొని వేల మందికి చదువు బోధించిన మహనీయురాలు అని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో మహిళలు శిఖరాలను అధిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు విశాల్ నగర ఉపాధ్యక్షులు వేణు గర్ల్స్ కన్వీనర్ శైలజ పాఠశాల ఉపాధ్యాయురాల్లు విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీఏ కులాల పరిరక్షణ సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలేకు జిల్లా అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి సాయిలు, రజక వర్కింగ్ ప్రెసిడెంట్ వై అనిల్ కుమార్, నాయి బ్రాహ్మణ కార్యదర్శిలు జే సత్యనారాయణ, బి గోపి నాయి బ్రాహ్మణ కోశాధికారి రమేష్ కూనపులి, అడ్వకేట్ రవి గంగపుత్ర నివాళ్లు అర్పించారు.

అంబేద్కర్ కాలనీలోగల సావిత్రిబాయి పూలే విగ్రహానికి మేయర్ దండు నీతూ కిరణ్ పూలమాల వేసి సావిత్రి పూలేలోని తెగువను, సామజిక సేవను అలవర్చుకోవాలని అన్నారు.

నిజామాబాద్ నగరంలోని అంబేద్కర్ నగర్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అజ్ఞానంలో మూఢనమ్మకాలతో కూనరిల్లుతున్న సమయంలో సావిత్రిబాయి పూలే 1848లో పూణేలో బడి తెరిచిందని తెలిపారు. 1873 సత్యశోధక్ మహిళా సమాజం నిర్మించారని అన్నారు. సమాజంలో భ్రూణ హత్యలు, హత్యాచారాలపై ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:బాల్కొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ముప్కాల్, బాల్కొండ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక, కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, జ్యోతిరావుపూలే, మైనార్టీ గురుకుల, ప్రయివేటు పాఠశాలల్లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో బాల్కొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరా, పీడీ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు దేవేందర్, రాంకిషన్, నరేష్, ప్రశాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:సావిత్రిబాయి పూలే మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ.. మహిళల పట్ల ఉన్న వివక్షత, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగా మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా చదువు నేర్పించారన్నారు. నేటికీ మహిళలు రెండవ తరగతి పౌరులుగా కేవలం వంటింటి కుందేలుగా భావిస్తున్నారని తెలిపారు. మనుధర్మ శాస్త్రం ప్రకారం పరిపాలించే పాలకులు మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఉపాధి అవకాశాలకోసం, ధరలను తగ్గించటంకోసం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. అప్పుడే సావిత్రిబాయి పూలే ఆశయాలు నెరవేరుతాయి అని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట రాములు, కమిటీ సభ్యులు పి సూరి, పార్టీ నాయకులు ఎం. గోవర్ధన్, కృష్ణ, సాయిలు, మహేష్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెస్సు అనిల్ కుమార్ రాజ్ కుమార్ పల్లె శ్రీనివాస్ యోగేష్ తదితరులు సావిత్రి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని సీవీఆర్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నాగరాజు తదితరులు పాల్గొన్నారు. గాయత్రి జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ ప్రజ్ఞ వంశీ, టీజీవిపి నాయకులు రుచిత అఖిల్ తదితరులు పాల్గొన్నారు.. పట్టణంలోని మామిడిపల్లి నలంద హైస్కూల్లో పాఠశాల యజమాన్యం లక్కారం సాగర్, ప్రసాద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. గాంధీనగర్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. పట్టణంలోని జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్, మామిడిపల్లి, జెండా గల్లీలో జరిగిన కార్యక్రమాల్లో కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత, మమత ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రెంజల్: విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన మొట్టమొదటి వ్యక్తి సావిత్రిబాయి పూలేనని ఎంఎస్‌పి నియోజకవర్గం నాయకులు లక్ష్మీ గారి భూమయ్య స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం ఎస్ పి మండల కోఆర్డినేటర్ బండారు పోశెట్టి, ఎమ్మార్పీఎస్ మండల కోఆర్డినేటర్ దగ్గుల శ్రీకాంత్, ఎమ్మార్పీఎస్ కో కన్వీనర్ లక్ష్మి గారి నరేష్, బాలానంద్, శ్యామ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్:మహిళల అభివృద్ధికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని బోధన్ ఎంపిపి బుద్దె సావిత్రి అన్నారు. బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సావిత్రిబాయి కార్యక్రమంలో మాజీ మండల రైతు బంధు కో ఆర్డినేటర్ బుద్దె రాజేశ్వర్, ఎంపీడీవో మధుకర్ , మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ చంద్రకాంత్ శర్మ, పంచాయతీరాజ్ ఏఈ సాయిలు, టిఆర్ఎస్ నాయకులు శ్యాంరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో...

బోధన్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్వేరోస్ ఇంటర్నేషనల్, ఖాజాపూర్ గ్రామంలో దళిత సంఘాల నాయకులు శేరే భీంరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చక్ర పాణి, సేఫ్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ లింబూరి లక్ష్మణ్, స్వేరోస్ సర్కిల్ నాయకులు పాండు, గోసంగి సంఘం నాయకులు రాజేష్, సురేందర్, వార్డెన్ వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భీంగల్:పట్టణకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ చిరంజీవి ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడా భీంగల్ ఉన్నత పాఠశాలలో పూలే జయంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ:సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. కోటగల్లి బాలికల కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నుస్రత్ జహన్, జిల్లా నాయకులు మనోజ్ నగర ఉపాధ్యక్షుడు సునీల్ నగర నాయకులు విజయ్, గౌరవ్, మనీషా, కోమలి పాల్గొన్నారు.

అంబేద్కర్ కాలనీలో గల సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ... సావిత్రిబాయి పూలే రాజరిక వ్యవస్థలో మహిళలకు విద్యనందించారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, రంజిత్, రఘురాం, అమర్, వంశీ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్బీ గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా మాల మహానాడు అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లయ్య సావిత్రిబాయిపూలే సేవలను కొనియాడారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య, విజయ్, విశాల్, దయానంద్, ఎక్నాథ్ వార్కరే, పరమేష్, సంతోష్, జగన్, సంతు, నాయకులు పాల్గొన్నారు.

నవీపేట్:సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జంగం గంగాధర్, మేకల ఆంజనేయులు, గంగాధర్, లక్ష్మణ్, పోశెట్టి, దేవకి, చిన్నమ్మి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ :సావిత్రిబాయి విగ్రహానికి పూలమాలవేస్తున్న సీపీఐ నాయకులు



ఆర్మూర్ : సావిత్రిబాయి పూలేకు నివాళ్లు అర్పిస్తున్న నలంద స్కూల్ వారు

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళా మణులు

ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



సాంబారి మోహన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అన్నిరంగాల్లో మహిళా మణులు రాణిస్తున్నారని ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ అన్నారు. ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్, టీఎస్ మార్క్ ఫెడ్ డైరెక్టర్ సంబారి మోహన్‌తోపాటు వైస్ ఎంపీపీ భూసాని అంజయ్య, సర్పంచ్ నోముల విజయలక్ష్మి రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ మాట్లాడుతూ ప్రతీ మహిళ ఒక శక్తి స్వరూపిణి ఆది శక్తి , సావిత్రిబాయి పూలే అని అన్నారు. విద్యను అభ్యసించి మహిళలందరికీ చదువుచెప్పి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలు ముందుంటున్నారని, అదే స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సాంబార్ మోహన్‌ను శాలువా జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎడ్ల శ్రీనివాస్, వీడీసి సభ్యులు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సాయిలు, బీసీ,ఎస్టి ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రం లోని మంగళవారం నవ తెలంగాణ దిన పత్రిక 2023వ క్యాలెండర్‌ను మోస్రా జెడ్పిటిసి విజయభాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికలు ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా ఉంటూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు తెలిపేందుకు అన్యాయాలను అరికట్టడానికి పత్రికలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శాంత కుమారి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు సర్పంచ్ సుమలత రామ్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు మంగళవారం ఇరిగేషన్ డీఈ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ చెరువు కింద పొలాల కాలువ ఉందని, దీని పక్కన 50 ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. గుండం వెంకటి అనే వ్యక్తి 60 గజాల భూమి ఉందని, ఆ భూమికి సుమారుగా 400 గజాల ఇరిగేషన్ చెరువు కింద కాలువ భూమి కబ్జా చేశాడని ఆరోపించారు. దీంతో కాలువ నీరు ప్లాట్లల్లో కి రావడంతో ఇబ్బందిగా మారిందన్నారు. కబ్జా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఇరిగేషన్ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

వివాహేతర సంబంధం సహించలేక హత్య

కేసును చాకచక్యంగా చేదించిన పోలీసులు

వివరాలను వెల్లడించిన ఏసీపీ

నవతెలంగాణ - బోధన్

బోధన్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చాట్ల శివ(22) హత్య కేసును బోధన్ పట్టణ పోలీసులు 24 గంటల్లో చేధించారు. మంగళవారం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బోధన్ ఏసిపి కిరణ్ కుమార్ కేసు వివరాలు వెల్లడించారు .బోధన పట్టణం శాంతినగర్‌కు చెందిన చాట్ల శివ అదే కాలనీకి చెందిన ఓ వివాహితతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పలుమార్లే వారిద్దరు సన్నితంగా ఉన్న సమయంలో ఆమె భర్త రాజే రంజిత్ చూసి హెచ్చరించాడు. అప్పటినుండి వీరి కుటుంబాలకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డిసెంబర్ 31న రాత్రి మృతుడు శివ తన కుటుంబ సభ్యులతో ఆమె డాన్స్ చేయడాన్ని ఆమె భర్త గమనించాడు. ఇది సహించలేని భర్త.. ఎలాగైనా ఆయన్ను చంపాలని భావించి మరుసటి రోజు ఆయన బంధువులైన పసిగంటి అరుణ్, మానే శివకుమార్ , దండే సునీల్, తన అమ్మ రుక్మిణితో కలిసి హత్యకు ప్రణాళిక రచించాడు. జనవరి 1 న రాత్రి 12 గంటల సమయంలో శివ బయటకు రాగానే రంజిత్ తనతో తెచ్చుకున్న గొడ్డలితో తలపై దాడి చేయగా కింద పడిపోయాడు. వెంటనే బంధువులతో కలిసి శివ ను కారులో వేసుకొని నర్సాపూర్ రోడ్‌లోని కొద్ది దూరంలో గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి గొడ్డలితో విచక్షణ రహితంగా దాడి చేయడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడిపై గతంలోనూ చాలా కేసులు ఉన్నాయని ఏసిపి తెలిపారు. పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, ఏఎస్ఐ బాబురావు, ఎస్సై నవీన్, ఏఎస్సై గంగా ప్రసాద్, సిబ్బంది కేసును చాకచక్యంగా ఛేదించి 24 గంటల్లో నిందితులను పట్టుకున్నారు. ఈ కేసు పరిశోధనలో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి ఏసిపి రివార్డు అందించారు. సమావేశంలో సీఐ ప్రేమ్ కుమార్ ,ఎస్సై నవీన్, పీటర్ పాల్గొన్నారు.

చురుగ్గా ఆర్‌వోబీ పనులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి వద్ద ఆర్‌ఓబి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మంగళవారం ఆర్అండ్‌బి డీఈ నాందేవ్ ఆధ్వర్యంలో పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆర్‌ఓబి773 మేనేజర్ జై సూర్య, సీనియర్ ఇంజనీర్ శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

రవాణారంగ కార్మికుల సంఘర్ష యాత్ర జయప్రదం చేయాలి :సీఐటీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రవాణరంగ కార్మికుల సంఘర్ష యాత్ర పోస్టర్‌ను నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని నాందేవాడలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీని పరిరక్షించాలని, ఆర్టీసీలో కార్మిక ఉద్యమంపై ఆంక్షలు ఎత్తివేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుండి 11 వరకు రాష్ట్రవ్యాప్త జీపు జాత జరుగుతుందని, తెలిపారు. ఈ జాతాను జిల్లాలోని రవాణా రంగ కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఖమ్మంలో ప్రారంభమైన యాత్ర 11న సంగారెడ్డి లో ముగుస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 12 లక్షల మందికిపైగా పనిచేస్తున్న రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు లేదని తెలిపారు. వివి గిరి నేషనల్ ఇన్స్టిట్యూట్ సంస్థ రవాణా రంగ కార్మికులపై అధ్యయనం చేసి 2007లోనే దేశవ్యాప్తంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఒక్క కార్మికుడు పనిచేస్తున్న చోట కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని తెలిపారు. వామపక్ష ప్రభుత్వం ఉన్న కేరళ రాష్ట్రంలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోటారు వాహన చట్టం 2019 తీసుకువచ్చి పెనాల్టీలు పెంచడం ద్వారా ప్రమాదాలను తగ్గిస్తామనడం బూటకమని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కో కన్వీనర్, ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కటారి రాములు, మోహిన్, లోకల్ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు దావూద్, మినీ గూడ్స్ డ్రైవర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిజాముద్దీన్, ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మణ్, ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు గంగాధర్, రాము, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు